# రెక్కల కష్టం.. వర్షార్పణం..

• మొలకెత్తిన ధాన్యం • కన్నీరు మున్నీరవుతున్న అన్నదాతలు



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళా రైతులు

అకాల వర్షాలకు రెక్కల కష్టం వర్షార్పణమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాయికల్ మండలం బోర్నపల్లిలోని కొనుగోలు కేంద్రంలో వడ్లు మొలకలు వచ్చాయి. ఆరుగాలం కష్టపడి పండించిన వడ్లు మొలకెత్తడంతో రైతులు కన్నీరు, మున్నీరుగా విలపిస్తున్నారు. వర్షాలకు పూర్తిగా తడిసిన ధాన్యం ఎలా అమ్ముడు పోతుందోనని, రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. కాగా, ఆదివారం మధ్యాహ్నం కాస్త ఎండ రావడంతో రైతులు బోర్నపల్లి వంతెన పైకి, బీటీ రోడ్లపైకి ట్రాక్టర్ల ద్వారా తడిసిన వడ్లు తీసుకువచ్చి ఆరబెట్టుకున్నారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. -రాయికల్, మే 25



సారంగాపూర్: వేదికపై గురువులతో బీర్‌పూర్ జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



కొడిమ్యాల: వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

సారంగాపూర్/కొడిమ్యాల, మే 25: బీర్‌పూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2001–02, కొడిమ్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తయిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆయా పాఠశాలల ఆవరణలో నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో గురువులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నారాయణ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల రూరల్, మే 25: కోరుట్ల మండలం సర్ఫరాజ్‌పూర్ గ్రామానికి చెందిన మొదటితరం పీపుల్స్‌వార్ పొట్టవత్తిని నారాయణ అలియాస్ కల్లూరు, పల్లె, పండుగ నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. అలాగే, గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త ఆదరి రాములు సోదరి చిన్న మల్లు గుండె పోటుతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షులు నత్తి రాజ్‌కుమార్, జిల్లా బంధు సమితి మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య, నాయకులు మహేశ్, నర్సయ్య, లింగమూర్తి, మల్లయ్య, సత్యనారాయణ, లక్ష్మీనర్సయ్య, శేఖర్, భరత్, రాజం తదితరులున్నారు.

## ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

రాయికల్, మే 25: రాయికల్ మండలం ఆలూరు గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు తాము చేపలు పెంచుకుంటున్న చెరువుపై హక్కులు కల్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా గ్రామంలోని కొత్తచెరువులో చేప పిల్లలు పోసి, పెరిగిన తర్వాత వాటిని అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. గ్రామ చెరువులో చేపలు పెంచుకుంటున్నందుకు గ్రామానికి రెండేళ్లకోసారి డబ్బులు సైతం చెల్లిస్తున్నామన్నారు. కాగా, రెండేళ్ల క్రితం కొత్త చెరువులో చేపలు పెంచుకునేందుకు హక్కులు కల్పించే విధంగా చేస్తామని చెప్పి కొందరు రూ. 80 వేలు తీసుకొని హక్కులు కల్పించలేదన్నారు. కాగా, ఆదివారం గ్రామస్తులు తమను పిలిచి గ్రామానికి డబ్బులు చెల్లించాలని అడిగినట్లు తెలిపారు. తమకు చెరువులో హక్కు కల్పిస్తేనే డబ్బులు ఇస్తామని చెప్పడంతో కొందరు దూషించడంతోపాటు దాడికి ప్రయత్నించారని పేర్కొన్నారు. చెరువుపై తమ కులానికి హక్కులు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ముదిరాజ్ కులస్తులు

## బీఆర్ఎస్ కార్యకర్తకు నివాళి

కొడిమ్యాల, మే 25: మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నాయకయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. నాయకయ్య మృతదేహంపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పూల మాల ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రొడ్డ శరత్, బాబు, తదితరులున్నారు.



నాయకయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## నా భర్తను బతికించండి



దవాఖానలో చికిత్స పొందుతున్న నర్సింహాచారి

- రోడ్డు ప్రమాదంలో ఏడుమోటలపల్లికి చెందిన నర్సింహాచారికి తీవ్రగాయాలు
- ఇప్పటికే చికిత్సకు పెద్ద మొత్తంలో ఖర్చు
- ఆపరేషన్‌కు మరో రూ.10 లక్షలు అవసరం
- ఆపన్న హస్తం అందించాలని భార్య లావణ్య వేడుకోలు

పెగడపల్లి, మే 25: రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబానికి పెద్ద కష్టమే వచ్చిపడింది. ఇంటిపెద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడి 100 రోజులుగా కోమాలోనే ఉండడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఇప్పటికే చికిత్సకు రూ.10లక్షలు ఖర్చు కావడం, ఆపరేషన్‌కు మరో రూ.10లక్షలు అవసరం కావడంతో భార్య తల్లడిల్లుతున్నది. దాతలు సాయం చేసి తన భర్తకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటున్నది. వివరాల్లోకి వెళితే.. పెగడపల్లి మండలం ఏడుమోటలపల్లికి చెందిన కొత్తపల్లి నర్సింహాచారిది పేద కుటుంబం. భార్య లావణ్య, ఒక కొడుకు, కూతురు ఉండగా, కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే గత ఫిబ్రవరి 9న గ్రామ శివారులో తన పశువులకు మేత వేసి రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా, బైక్ ఢీకొని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. కొద్ది రోజుల చికిత్స అనంతరం, బ్రెయిన్‌కు ఆపరేషన్ చేశారు. కానీ నయం కాలేదు. వైద్యులు ఇక్కడి నుంచి తీసుకెళ్లాలని చెప్పడంతో గత్యంతరం లేక, హైదరాబాద్‌లోనే మరో ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ప్రమాదం జరిగి 100 రోజులు గడిచినా నర్సింహాచారి కోమాలోనే ఉండగా, అతనికి అలాగే వైద్యం అందిస్తున్నారు. ఇప్పటికే రూ.10 లక్షల వరకు ఖర్చయ్యాయని, ఇంకో ఆపరేషన్ చేస్తే తప్ప తన భర్త కోలుకోలేని పరిస్థితి లేదని, మరో రూ.10లక్షలు ఖర్చవుతాయని లావణ్య విలపిస్తూ చెబుతున్నది. దాతలు ఎవరైనా సాయం చేసి తన భర్తను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నది. సాయం చేసే వారు సెల్ నంబర్ 96668 37987కు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు సెల్ నంబర్ 93906 15411 లో సంప్రదించాలని కోరుతున్నది.


## నేడు బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక పోటీలు

జగిత్యాల రూరల్, మే 25: పట్టణంలోని మినీ స్టేడియంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని పేర్కొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

జగిత్యాల, మే 25: నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యవర్గంతో కలిసి కృషి చేస్తానని సంఘం జిల్లా అధ్యక్షురాలు క్యారంగుల అరుణ అన్నారు. జిల్లా నూతన కార్యవర్గం ఆదివారం కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, అదనపు కలెక్టర్ లత, ఆర్డీవో మధుసూదన్, ఇతర ఉద్యోగ సంఘం నాయకులను మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ, నాల్గో తరగతి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఆమె సంఘం జిల్లా కార్యదర్శి నారాయణ, ఉద్యోగులు తదితరులున్నారు.

## అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జగిత్యాల, మే 25: యువత అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సభ్యులు నల్ల శ్యామ్, మద్దెల నారాయణ, నక్క విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

జగిత్యాల, మే 25: తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని తులసీనగర్(పల్లి గ్రౌండ్)కు చెందిన హరిత హోమ్స్ కాలనీవాసులు ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, కరెంట్ పోల్స్ లేక ఇబ్బందులు పడుతున్నామని తెలుపగా, త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువా, పుష్పగుచ్ఛంతో కాలనీవాసులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఆరుముళ్ల పవన్, కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బైరం హరికిరణ్, సమిండ్ల రాజేశ్, ఆర్థిక కార్యదర్శి కాసం రాజశేఖర్, ఉపాధ్యక్షుడు భీమనాతి లక్ష్మణ్, సహాయ కార్యదర్శి దాత్రిక రాజు, గౌరవాధ్యక్షుడు నూనె శ్రీనివాస్, నల్లెల మల్లేశం, చింత చంద్రశేఖర్, జైశెట్టి శ్రీనివాస్, ప్రకాశ్, భువనగిరి శ్రీధర్, బల్గూరి సత్యంరావు, అన్నమనేని శ్రీనివాస్ రావు, మాధవ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

సారంగాపూర్, మే 25: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు రాజీవ్ యువ వికాసం పథకం కింద బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చౌడారపు గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు సకాలంలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు.

మెట్‌పల్లి టౌన్, మే 25: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సోమవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మోహన్ తెలిపారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో చేసిన ఫారం, ఆధార్, రేషన్, పాన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, బ్యాంక్ ఖాతా, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో రావాలని కోరారు.

## తల్లిదండ్రులను పోషించని కొడుకులకు కౌన్సెలింగ్

జగిత్యాల, మే 25: తల్లిదండ్రులను పోషించక నిరాధరిస్తున్న కొడుకులు, కోడళ్లకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం కౌన్సెలింగ్ చేశారు. తాము తమ తల్లిదండ్రులను పోషిస్తూ, బాగోగులు చేసుకోవడానికి సమ్మతించి ఒప్పంద పత్రం రాసిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాశ్ రావు, బైరి రాధ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గ్రామ పాలనాధికారి పరీక్ష

జగిత్యాల, మే 25: జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రామ పాలనాధికారి రాత పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 149 మందికి గానూ 142 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. ఏడుగురు గైర్హాజరైనట్లు తెలిపారు.

## జూనియర్ లెక్చరర్ల నిరసన




నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న జూనియర్ లెక్చరర్లు

జగిత్యాల, మే 25: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేసే జూనియర్ లెక్చరర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీజీఎల్ఏ–711 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేసే జూనియర్ లెక్చరర్లకు రెండో వార్షిక ఇంక్రిమెంట్ ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ నిలుపుదల చేసినందుకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష విధులకు హాజరైనట్లు తెలిపారు.

## గోడెక్కిన రాజీవ్ యువ వికాసం..!

- సిబిల్ స్కోర్ లేని దరఖాస్తుదారుల వివరాల లిస్టును గోడకు అతికించిన అధికారులు



మండల పరిషత్ కార్యాలయ గోడపై అతికించిన సిబిల్ స్కోర్ లేని దరఖాస్తుదారుల లిస్టు

మల్లాపూర్, మే 25: రాజీవ్ యువ వికాసం పథకం కొంత మంది దరఖాస్తుదారుల పాలిట శాపంగా మారింది. స్వయంగా రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లబ్ధిదారుల ఎంపికలో సిబిల్ స్కోర్‌కు ఎలాంటి సంబంధం లేదని పలు ప్రకటనల ద్వారా స్పష్టం చేసినప్పటికీ క్షేత్ర స్థాయిలో ఏ మాత్రం అమలు కావడం లేదని యువ వికాసం దరఖాస్తుదారులు మండిపడుతున్నారు. మల్లాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులుగా లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. కాగా, సిబిల్ స్కోర్ లేని వారి జాబితాను కార్యాలయ గోడకు అతికించారు. అలాగే, ఈ జాబితాలో పేరు ఉన్న వారిని కనీసం ఇంటర్వ్యూ కూడా చేయడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబిల్ స్కోర్ పేరిట తమ పేర్లు గోడపై అతికించి తమను అవమానిస్తున్నారని పేర్కొన్నారు.

## హుజూరాబాద్ వాసికి జాతీయ అవార్డు

హుజూరాబాద్ టౌన్, మే 25: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఆడెపు సూర్యం–సంధ్యారాణి దంపతుల కుమారుడు ధీరజ్ జాతీయస్థాయి గ్రేట్ పీపుల్ మేనేజర్స్ అవార్డు ముంబైలో అందుకున్నారు. గ్రేట్ పీపుల్ మేనేజర్స్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా వంద మంది వ్యాపారవేత్తలను ఎంపిక చేసింది. రెండు రోజుల క్రితం ముంబైలో నిర్వహించిన గ్రేట్ మేనేజర్స్ లీగ్ సమ్మిట్– 2025 లో భాగంగా ఆయనకు అవార్డును, సర్టిఫికెట్‌ను అందజేశారు.

## మురుగు నీటిని తొలగించరూ..



బోరు పక్కనే ఉన్న నిలిచి ఉన్న మురుగు నీరు

కొడిమ్యాల, మే 25: మండలంలోని పూడూర్ గ్రామంలో బైపాస్ రోడ్డును ఆనుకొని ఉన్న మంచి నీటి బోర్ పక్కన మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతున్నది. ఈ బోర్ నీటినే ప్రతి రోజూ గ్రామస్తులకు సరఫరా చేస్తుంటారు. గ్రామం నుంచి వస్తున్న మురుగు నీరంతా బోర్ చుట్టూ నిలిచి ఉండడంతో నీళ్లు కలుషితమవుతాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు నీరు వెళ్లేలా డ్రైనేజీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఉచిత వైద్య శిబిరం



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు

మెట్‌పల్లి, మే 25: పట్టణంలోని అమృత, డీఎస్ టవర్స్‌లో ఆదివారం కరీంనగర్‌లోని రెనే దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు రవి కుమార్, సమీర్, రాకేశ్, రీతురావు హాజరై వివిధ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య శిబిరం నిర్వాహకులు మహాజన్ నర్సింలు, దొంతుల శివకుమార్, సుధాకర్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, జగన్, ఆనంద్, సత్యనారాయణ, వేణు, అభిలాష్, పడిగెల శ్రీనివాస్, రాంభూపాల్, భీమేశ్, స్వామి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త చెరువుకు మరమ్మతులు చేపట్టాలి

మల్లాపూర్, మే 25: గొర్రెపల్లి గ్రామశివారులోని కొత్త చెరువుకు మరమ్మతులు చేపట్టాలని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, ఎంపీ ధర్మపురి అర్వింద్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుకు ఆదివారం ట్విట్టర్ ద్వారా గ్రామానికి చెందిన గెల్లె మల్లేశ్‌యాదవ్ అనే ఎన్ఆర్ఐ కోరినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు చెరువు కట్ట పూర్తిగా తెగిపోయిందని, దీంతో గ్రామంలో సాగు, తాగునీరు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

మేడిపల్లి, మే 25: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు పార్ట్‌టైమ్ ప్రాతిపదికన పని చేయడానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి వెంకటేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలో పీజీతో పాటు బీఎడ్ చేసి, కనీసం ద్వితీయ శ్రేణి మార్కులు పొంది ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు మేడిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. బాలికల పాఠశాల, కళాశాలలో మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. అభ్యర్థులను మెరిట్, డెమో ప్రాతిపదికన ఎంపిక చేస్తామని తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మేడిపల్లి, మే 25: భీమారం మండలం గోవిందారం గ్రామానికి చెందిన నిరుపేద కంది పోశాలు ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి అలయన్స్ క్లబ్ జిల్లా సభ్యులు ఆదివారం రూ. 27 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ సభ్యులు రాజేంద్రప్రసాద్, కటుకం సురేందర్, బండ్ల గజానందం, కటుకం రాజశేఖర్, కొక్కుల శంకర్, దాసరి గంగాప్రసాద్, కొప్పెల భూమారెడ్డి, నాయిని రాజు, రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి

జగిత్యాల, మే 25: జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ అధ్యక్షతన యూనియన్ విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య హాజరై మాట్లాడుతూ, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి మల్లేశం, మహిళా నాయకురాలు న్యాతరి మల్లవ్వ, నాయకులు రాజన్న, రాజు, సత్తయ్య, దేవయ్య, రాజేందర్, చంద్రయ్య, తిరుపతి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు



కోరుట్ల: అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు


రాయికల్/కోరుట్ల, మే 25: రాయికల్, కోరుట్ల మున్సిపల్ కార్యాలయాల్లో ఆదివారం రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న బీసీ దరఖాస్తుదారులకు అధికారులు ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను మున్సిపల్, బ్యాంక్ అధికారులు పరిశీలించారు. కోరుట్లలో మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, డీఈఈ సురేశ్, మైనార్టీ, ఎస్టీ, ఈబీసీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## అంజన్న ముడుపుల ఆదాయం @ రూ.85 వేలు

మల్యాల, మే 25: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు జరిగిన హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాల్లో దీక్షాపరులు సమర్పించిన ఇరుముడుల్లోని ముడుపులను ఆదివారం విప్పి లెక్కించారు. నగదు రూపంలో ఆలయానికి రూ. 85,094 సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీకాంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక పరిశీలకుడు రాజమౌళి, పర్యవేక్షకులు సునీల్‌కుమార్, చంద్రశేఖర్, హరిహరనాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్, కూరగాయల రాములు, ఏఎస్ఐ శ్రీనివాస్, సేవాసమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ

మల్యాల, మే 25: మండలంలోని సర్వాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లిలో అంబేద్కర్ సంఘం నాయకులు అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, అంబేద్కర్ జీవితం ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మల్యాల సీఐ నీలం రవి, నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, దొంగ ఆనందరెడ్డి, దారం ఆదిరెడ్డి, ముత్యపు శంకర్, శనిగరపు తిరుపతి, చెవులమద్ది శ్రీనివాస్, నక్క రాజయ్య, లక్ష్మణాచారి, హనుమంతు, సంగని రవి, బొట్ల ప్రసాద్, సంత ప్రకాశ్‌రెడ్డి, బండి రవి, నలువాల సంజీవ్, బెజ్జంకి చిన్న దుర్గయ్య, మ్యాక లక్ష్మణ్, ఆగంతం వంశీధర్, వీరబత్తిని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

## సైనికులకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ



సంఘీభావ ర్యాలీ తీస్తున్న యువకులు

పెగడపల్లి, మే 25: పెగడపల్లి మండల కేంద్రంతో పాటు బతికపల్లిలో భారత సైనికులకు మద్దతుగా ఆదివారం యువకులు సంఘీభావ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు మర్రిపెల్లి సత్యం, పల్లె మోహన్‌రెడ్డి, గంగుల కొమురెల్లి, షేర్ అంజయ్య, చింతకింది అనసూర్య, సాయి, మల్లేశం, బాబు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## మహిళలకు కుట్టు మిషన్లు అందజేత



మహిళకు కుట్టు మిషన్, సర్టిఫికెట్ అందజేస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్, మే 25: వెల్గటూర్ మండలం చెగ్యాం, కిషన్‌రావుపేటలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ఆదివారం విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కుట్టు మిషన్లతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గుండాటి గోపిక–జితేందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కిశోర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

సారంగాపూర్, మే 25: మండలంలోని పెంబట్ల దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో కూచిపూడి నృత్యం నేర్చుకున్న చిన్నారులకు గజ్జపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ఫౌండర్ శంకరయ్య, ఆలయ ఈవో వడ్లూరి అపూష, కూచిపూడి నృత్య శిక్షణ నిర్వాహకురాలు యమున, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తేలు రాజు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మూలమలుపు.. ప్రమాదాలకు నెలవు

మెట్‌పల్లి, మే 25: మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఆరపేట శివారులో గల శివాలయం సమీపంలో 63వజాతీయ రహదారిపై మూలమలుపు ప్రమాదాలకు నెలవుగా మారింది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కోరుట్ల –మెట్‌పల్లి పట్టణాల మధ్య నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. మూలమలుపు వద్ద ఏ మాత్రం ఆదమరిచి డ్రైవింగ్ చేసినా ప్రమాదానికి గురికావాల్సిందే!. గతంలో అనేక మంది వాహన చోదకులు ప్రమాదానికి గురై ప్రాణాలు విడిచారు. మరికొందరు తీవ్రంగా గాయపడినా, ప్రాణాలతో బయటపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. గత 25 రోజుల వ్యవధిలో రెండు ప్రమాదాలు జరిగాయి. పగటి పూట సైతం ఈ మూలమలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏండ్ల తరబడిగా ఇక్కడ అనేక ప్రమాద సంఘటనలు జరుగుతున్నా సంబంధిత జాతీయ రహదారి అథార్టీ అధికారులు పట్టించుకోవడం లేదు. సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు స్పందించి మూలమలుపు వద్ద ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.